
రైతు సంబురం



కొల్లాపూర్ మండలం రామాపురంలో రైతులతో కలిసి ఎడ్ల బండిపై వెళ్తున్న రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట వద్ద ర్యాలీగా వస్తున్న దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

- ఏకకాలంలో లక్షలోపు రుణాలు మాఫీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలో 1,66,847 మందికి లబ్ధి
- రైతుల ఖాతాల్లో రూ.942,72,50,670 జమ
- గ్రామాల్లో సంబురాలు, సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకాలు

మహబూబ్‌నగర్/నారాయణపేట/గద్వాల/వనపర్తి, జూలై 18: అన్నదాతల్లో ఆనందం వెల్లువిరిసింది.. పంటసాగు కోసం చేసిన అప్పు ఒకే విడతలో మాఫీ కావడంతో వారి ముఖాల్లో సంతోషం కనిపిస్తోంది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పలు విడతల్లో రుణమాఫీ చేసిన కారణంగా మాఫీ వడ్డీకే సరిపోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి మొదటి విడతలో గురువారం ఏకకాలంలో లక్ష రూపాయల రుణం మాఫీ చేయడంతో వారిలో ఆనందం వెల్లువిరిసింది.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు ఊరూరా క్షీరాభిషేకాలు చేశారు.. పాలమూరు ఉమ్మడి జిల్లాలోని 1,66,847 మంది రైతుల ఖాతాల్లో రూ.942,72,50,670 జమ చేశారు. బ్యాంకుల్లో తమ రుణాలు మాఫీ కావడంతో రైతులు సంబురాలు చేసుకున్నారు. ఉదయం నుంచే అన్ని గ్రామాలలో ర్యాలీలు, సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకాలు చేశారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని రైతు వేదికల వద్ద సాయంత్రం నాలుగు గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి సందేశాన్ని విన్నారు. అక్కడే సంబురాలు చేసుకున్నారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గం హన్వాడ మండలం టంకర రైతు వేదిక వద్ద ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి రైతు సంబురాల్లో పాల్గొన్నారు. రైతులతో కలిసి సీఎం సందేశం విన్నారు. దేవరకద్ర నియోజకవర్గం మూసాపేట రైతువేదిక వద్ద రైతులతో కలిసి ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి సంబురాలు జరుపుకున్నారు. రెండో విడతలో రూ.1.50 లక్షల రుణాలు తీసుకున్న వారికి వారం రోజుల్లోనే మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో మిగతా రైతులు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నారాయణపేట జిల్లా వ్యాప్తంగా తొలి విడతలో 28,684 మంది రైతులకు రుణమాఫీ చేశారు. ఇందుకు సంబంధించి రైతుల ఖాతాల్లో రూ.165.45 కోట్లు జమ చేశారు. దీంతో జిల్లా వ్యాప్తంగా రైతులు సంబురాలు చేసుకున్నారు. జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రాపటాలకు క్షీరాభిషే కం చేశారు. బ్యాంకుల వద్ద సంబురాలు చేసుకున్నారు.

నారాయణపేట, మక్తల్ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు పర్ణికారెడ్డి, వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, జిల్లా వ్యవ సాయ అధికారి జాన్‌సుధాకర్ ధన్వాడ రైతు సంబురాల్లో పాల్గొన్నారు.

జోగుళాంబ గద్వాల జిల్లాలో 24,398 మంది రైతులు, 23,548 రైతు కుటుంబాలకు రూ.144కోట్లను మాఫీ చేస్తూ వారి ఖాతాలలో జమ చేశారు. దీంతో జిల్లాలో రుణమాఫీ సంబురాలు అంబురాలు అంబరాన్ని అంటాయి. ఎద్దుల బండ్లతో ర్యాలీలు నిర్వహించి సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రైతు వేదికలలో రైతులతో కలిసి సంబురాలు నిర్వహించారు. జడ్పీ మాజీ చైర్మన్ సరిత, మునిసిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ ఎద్దుల బండ్ల ర్యాలీలో పాల్గొన్నారు.

వనపర్తి జిల్లాలో జిల్లాలో 29,613 మంది రైతులకు రూ.156.92 కోట్లు మాఫీ అయినట్లు అధికారులు తెలిపారు. దీంతో పట్టణంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే మేఘారెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రైతు వేదిక వద్దకు ఎమ్మెల్యే మేఘారెడ్డి ఎద్దుల బండిపై వచ్చారు. నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా 46,780 మంది రైతుల ఖాతాల్లో రూ.265,20,50,670ల నిధులు జమ చేసినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు.

జిల్లా పేరు	రైతుల సంఖ్య	మాఫీ అయిన రూపాయలు (కోట్లలో)
మహబూబ్‌నగర్	37,372	రూ.211.15
జోగుళాంబగద్వాల	24,398	రూ.144.00
నాగర్‌కర్నూల్	46,780	రూ.265,20,50,670
నారాయణపేట	28,684	రూ.165.45
వనపర్తి	29,613	రూ.156.92



పాలమూరు జిల్లా హన్వాడ రైతువేదికలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



చాలా సంతోషంగా ఉంది

నేను బ్యాంకులో రూ.95 వేల అప్పు తీసుకున్నాను. ఇన్నాళ్లు అప్పు ఎలా తీర్చాలన్న బెంగ ఉండేది. ఇప్పుడు రేవంత్ సర్కార్ ఒకేసారి బ్యాంకులో ఉన్న అప్పును మాఫీ చేయడం ఎంతో సంతోషంగా ఉంది. ఇది వరకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఏటా రూ.25 వేలు మాఫీ చేయడం వల్ల అవి వడ్డీకి సరిపోయేవి. ఇప్పుడు ఒకేసారి మాఫీ చేయడంతో రైతులు సంతోషంగా ఉన్నారు.

- చెన్నయ్యయాదవ్, కిష్టంపల్లి



అప్పుభారం తీరింది

పంట పెట్టుబడి కోసం బ్యాంక్‌లో రూ.75 అప్పు తీసుకున్నాను. ఇప్పుడు సర్కారు మొత్తం అప్పు మాఫీ చేయడంతో అప్పు భారం తీరింది. ఒకేసారి మొత్తం అప్పు మాఫీ కావడంతో ఖరీఫ్ పంట సాగు ఉత్సాహంగా చేస్తాం. ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు, రైతులంతా సంతోషపడుతున్నారు.

- అంజనేయులు, లింగన్నపల్లి

లక్ష్మమ్మా నాది మీ జిల్లానే..

-రైతు రుణమాఫీ సంబురాల్లో సీఎం రేవంత్‌రెడ్డి



ధన్వాడ : లక్ష్మమ్మ నాది కూడా మీ జిల్లానే రుణమాఫీ చేయడం బాగుందా.. అక్కడ పర్ణికమ్మ ఉందా.. రైతులు ఏమనుకుంటున్నారని సీఎం రేవంత్‌రెడ్డి ధన్వాడకు చెందిన కుర్వ లక్ష్మమ్మను వీసీలో అడిగారు. రుణమాఫీ సందర్భంగా గురువారం ధన్వాడ రైతు వేదికలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో కుర్వ లక్ష్మమ్మ సీఎం రేవంత్‌రెడ్డి వీసీలో మాట్లాడారు. రుణమాఫీ చేయడంపై రైతులు ఏమనుకుంటున్నారని అడిగారు. రైతుల చాలా సంతోషంగా ఉన్నారని, ఇక్కడ మేమందరం పండుగ చేసుకుంటుకున్నాం అంటూ లక్ష్మమ్మ సీఎంకు వివరించారు. మీ పర్ణికమ్మ ఉందా ఆమెను బాగా చూసుకోండని సీఎం చమత్కారించారు.

రాములవ్వా నీకెంత భూమి ఉంది

- బ్యాంకులో అప్పు మాఫీ అయ్యిందా..

వీసీలో మహిళా రైతుతో ముచ్చటించిన సీఎం రేవంత్‌రెడ్డి



కొల్లాపూర్ మండలం రామాపురం రైతు వేదికలో జరిగిన వీసీలో మాట్లాడుతున్న రాములమ్మ, చిత్రంలో మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్ : రాములవ్వా నీకెంత భూమి ఉంది.. ఏయే పంటలు వేస్తున్నావు.. వ్యవసాయం ఎలా ఉందని సీఎం రేవంత్‌రెడ్డి మహిళా రైతును ఆరా తీశారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా.. కొల్లాపూర్ మండలంలోని రామాపురం రైతు వేదికలో ఏర్పాటు చేసిన రుణమాఫీ కార్యక్రమానికి రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, కలెక్టర్ బదావత్ సంతోష్ హాజరయ్యారు. రైతు రుణమాఫీ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయం నుంచి ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో మాట్లాడారు. అందులో భాగంగా రామాపురం మహిళా రైతు వసంతాపురం రాములమ్మతో ముచ్చటించారు. రాములవ్వ నీకు ఎంతపొలం ఉంది, పొలంలో ఏ పంటలు సాగు చేస్తున్నావు, నీకు బ్యాంకులో ఎంత అప్పు ఉంది, మాఫీ అయ్యిందా అని సీఎం రేవంత్‌రెడ్డి అడిగారు. తనకు రూ.60వేల అప్పు ఉండే.. రుణ మాఫీ చేసినందుకు సంతోషంగా ఉందని రాములమ్మ సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తనకున్న ఎకరా పొలంలో వరి, వేరుశనగ పంట సాగు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. రైతు రుణమాఫీ అయిందని గ్రామంలో ఉన్న అందరికీ చెప్పాలని రాములమ్మకు సీఎం సూచించారు. అనంతరం మంత్రి జూపల్లి కృష్ణారావు రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి మొదటి విడత గా లక్షలోపు రుణ మాఫీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, రుణమాఫీతో పండుగ జరుపుకుంటున్న రైతులందరికీ మంత్రి జూపల్లి శుభాకాంక్షలు తెలిపారు. రుణమాఫీతో రైతులు అప్పుల నుంచి బయటపడతారని, ఏకకాలంలో రుణ మాఫీ చేసేందుకు కేసీఆర్ ప్రభుత్వానికి సాధ్యం కాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ ఎలా చేస్తుందన్న అతి నమ్మకంతో మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగస్టు 15లోగా రుణమాఫీ చేయకపోతే రాజీనామా చేస్తారని ప్రకటించారని గుర్తు చేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడి సీఎం రేవంత్‌రెడ్డి రుణమాఫీ చేశారన్నారు. కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ రుణమాఫీ అర్హుల జాబితాను గ్రామాల వారీగా రైతులకు తెలుపనున్నట్లు పేర్కొన్నారు. అంతకు ముందు రామాపురం గ్రామంలో ఎడ్ల బండిపై కలెక్టర్ బదావత్ సంతోష్, రైతులతో కలిసి మంత్రి జూపల్లి ర్యాలీ నిర్వహించారు. కొల్లాపూర్ నియోజకవర్గ రైతుల పక్షాన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లుభట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావులకు మంత్రి జూపల్లి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో పీ నాగరాజు, జిల్లా స్థాయి అధికారులు, మండల రెవెన్యూ అధికారులు, రామాపురం గ్రామ కాంగ్రెస్ నాయకులు కొమ్మరాజుయాదవ్, మాజీ సర్పంచ్ బచ్చలకూర బాలరాజు, కాంగ్రెస్ నాయకులు ఆకునమోని రాముయాదవ్, చంద్రయ్య, ఎల్ఐసీ నాగరాజు, శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

నట్టేట ముంచిన బ్యాడిగీ

- గతేడాది క్వింటాల్ మిర్చి ధర రూ.60వేలు
- ఈ ఏడాది 80 శాతానికి పడిపోయిన ధరలు
- ఏసీల్లో మగ్గుతున్న వేలాది క్వింటాళ్ల మిర్చి
- అప్పులపాలైన రైతులు



ఆరబెట్టిన మిర్చిని కుప్పగా పోస్తున్న రైతు(ఫైల్)

అలంపూర్ చౌరస్తా, జూలై 18: ఏం పంట వేశావన్న అని ఒక రైతు మరో రైతును అడిగితే బ్యాడిగీ మిర్చి వేశాను అంటే చాలు.. అమ్మో బ్యాడిగీ సాగు చేశావా..? అని ఆశ్చర్యం వ్యక్తం చేసేవారు. ఎందుకంటే ఆ పంటకు అంత డిమాండ్ ఉండేది. పెట్టుబడి అధికమే అయినా కింటాల్‌కు ధర రూ.30వేల నుంచి 60వేల దాకా ఉండేది. కానీ గతేడాది బ్యాడిగీ మిర్చి సాగు చేసిన రైతులు ఈ పంట ఎందుకు వేశామా.. అనే పరిస్థితి ఏర్పడింది. పెట్టుబడి ఎప్పటిలాగే పెట్టినా.. దిగుబడి రాలేదు, ధరలు కూడా పూర్తిగా పడిపోవడంతో రైతులు పెట్టుబడికి చేసిన అప్పు తీర్చలేక విలవిల్లాడుతున్నారు. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది 80 శాతం ధరలు పడిపోయాయి. మునుముందు ఏమైనా ధరలు పెరుగుతాయనే ఆశతో కోల్డ్‌స్టోరేజీలలో నిలువ ఉంచుకున్నారు. నాలుగు నెలలు కావస్తున్నా కొనేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో మిర్చి రైతులకు నిద్రపట్టడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గతేడాది క్వింటాల్ ధర రూ.60వేలు

గతేడాది జోగుళాంబ గద్వాల జిల్లాలో మిర్చి 65,115 ఎకరాల్లో సాగు చేశారు. ఎకరానికి రూ.25 వేల నుంచి 50వేల దాక వెచ్చించి వివిధ రకాల మిర్చి సాగు చేశారు. అత్యధికంగా ఇటిక్యాల మండలంలో 16వేల ఎకరాలు, మానవపాడు మండలంలో 11వేల ఎకరాలు, అత్యల్పంగా కేటీదొడ్డి మండలంలో 400ల ఎకరాల్లో సాగు చేశారు. జిల్లాల్లో అత్యధికంగా గుంటూరు మిర్చి, 2043 బ్యాడిగీ, డబ్బిబ్యాడిగీ, ఆర్మూర్, తేజ మొదలగు రకాలు సాగు చేస్తారు. వర్షాభావ పరిస్థితుల వల్ల, వాతావరణ మార్పుల వల్ల దిగుబడులు గణనీయంగా పడిపోయాయి. ఎకరానికి 3నుంచి 12 క్వింటాళ్ల మేర మాత్రమే దిగుబడి వచ్చింది. వీటిలో అధిక డిమాండ్ ఉన్న రకం 2043 బ్యాడిగీ రూ.60వేలు, డబ్బి బ్యాడిగీ రకానికి లక్షకు పైగా పలికాయి. బ్యాడిగీ రకాలు ఎకరానికి కేవలం 2 నుంచి 6 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చిందిన రైతులు వాపోయారు.

మిత్తీలు చెల్లించలేక పోతున్నాం

బ్యాడిగీ రకాలను నమ్ముకుని సాగు చేసిన రైతులు చేసిన అప్పులకు మిత్తీలు చెల్లించలేక పోతున్నారు. ఆరుగాలం కష్టించి పండించిన రైతన్నకు నేడు కన్నీళ్లే మిగిలాయి. చీడపీడల నుంచి పంటను కాపాడి అమ్మకానికి వెళ్లితే నిరాశే మిగిలింది. గత పదేళ్లలో బ్యాడిగీ రకం మిర్చీకి ఈ పరిస్థితి ఎప్పుడు రాలేదని, భవిష్యత్‌లో పెరిగే పరిస్థితి కనిపించడంలేదని వ్యాపారులు అంటున్నారు. దేశీయ మార్కెట్లో బ్యాడిగీ రకానికి ధరలు పడిపోవడంతో ఎవరు అడగటంలేదు. దీంతో నిల్వ ఉంచుకున్న రైతులు తీవ్రఅందోళనలో ఉన్నారు.

ధరలేదు, దిగుబడి రాలేదు ..

గతేడాది ధరలు ఉండటంతో నాలుగు ఎకరాలలో మిర్చి సాగు చేశాను. కనీసం 40 క్వింటాళ్లు రావాల్సిన కేవలం ఏడు క్వింటాళ్లు మాత్రమే వచ్చింది. దీనికి తోడు ధర పడిపోయింది. వచ్చినకాడికి అమ్ముకుందామన్న వ్యాపారులు బ్యాడిగీ రకాన్ని పలకరిస్తలేరు. చివరికి చేసిన అప్పులకు మిత్తీలు కట్టలేక పోతున్నాం.

- బీశంశ్వర్, మిర్చి రైతు చెన్నిపాడు గ్రామం, మానవపాడు మండలం



అలంపూర్ చౌరస్తాలోని కోల్డ్‌స్టోరేజీ ముందు బారులు తీరిన మిర్చి (ఫైల్)

శంకర సముద్రం ఆయకట్టుకు

సాగునీరు విడుదల



అధికారులతో కలిసి సాగునీటిని విడుదల చేస్తున్న నాయకులు

కొత్తకోట, జూలై 18 : మండలంలోని కానాయపల్లి గ్రామ సమీపంలో గల శంకర సముద్రం ఆయకట్టుకు గురువారం అధికారులు సాగునీటిని విడుదల చేశారు. సోమవారం అదును దాటుతోంది అనే కథనం ప్రచురణ కావడంతో నారుమడి పోసుకోవడానికి గడువు దాటిన నీళ్లు విడుదల చేయారంటూ రైతులు నాయకులపై ఒత్తిడి తెచ్చారు. ఆ మేరకు కాంగ్రెస్ నాయకులు రైతుల ఆవేదనను ఇరిగేషన్ ఎస్ఈ సత్యాశీలారెడ్డి వినిపించారు. ఎస్ఈ ఆదేశం మేరకు ఏఈ ఆకిల్ సాగునీటి విడుదల చేయించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులతో పాటు నాయకులు ప్రశాంత్, శేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, బోయెజ్, శ్రీనివాసులు, శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, రాములు యాదవ్, రవీందర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, నరేందర్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అన్నదాతలు బిజీ బిజీ



ఇటీవల కురుస్తున్న ముసురు వర్షాలకు అన్నదాతలు పంట పొలాల్లో బిజీగా ఉన్నారు. బోరు బావుల్లో ఉన్న కొద్దిపాటి నీరు ముసురు వర్షానికి కలిసి వస్తుందని కరిగేట్లు చేస్తున్నారు. ఇదే అదునుగా వరినాట్లు జోరందుకున్నాయి. వనపర్తి మండలం నాగవరం గ్రామం సమీపంలో కరిగేట చేయడం, నాట్లు వేయడంలో బీజీగా ఉన్న అన్నదాతల చిత్రాలను ఆంధ్రజ్యోతి తన కెమరాలో బంధించింది.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వనపర్తి.



సర్కారు భూములకు ఎసరు




మల్లేశ్వరం శివారులో కృష్ణానదిలో తేలిన భూముల్లో నువ్వుల పంట కోస్తున్న రైతులు(ఫైల్)

- పరిహారం పొంది విక్రయించేందుకు సిద్ధమవుతున్న పూర్వపు యజమానులు
- క్రయ, విక్రయాలు ఆపాలని అధికారులతో గ్రామస్థుల మొర
- కృష్ణానదిపై తీగల వంతెన, 167 కే జాతీయ రహదారి మంజూరుతో గద్దల్లా వాలుతున్న రియల్ వ్యాపారులు

కొల్లాపూర్, జూలై 18: తెలుగు ప్రజల ప్రయోజనాల కోసం 1960లో శ్రీశైలం ప్రాజెక్టు పనులు ప్రారంభించారు. ఈ ప్రాజెక్టులో ముంపునకు గురైన గ్రామాలను అప్పటి ప్రభుత్వం ఎగువ ప్రాంతాలకు తరలించింది. ముంపునకు గురైన భూములకు సంబంధించిన యజమానులకు అప్పటి భూమి విలువ ప్రకారం ఎకరానికి వెయ్యి 2వేల రూపాయల వరకు ధర చెల్లించి ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నది. ప్రాజెక్టులో నీటి మట్టం తగ్గినప్పుడు తేలిన భూముల్లో రైతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు.

కానీ కృష్ణానదిపై తీగల వంతెన నిర్మాణం చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సుముఖంగా ఉండడంతో ఇక్కడి భూములకు డిమాండ్ పెరిగింది. దీనికి తోడు 167కే జాతీయ రహదారికి తొలి విడతలో కేంద్రం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఇప్పటికే జిల్లాలోని కల్వకుర్తి నుంచి కొల్లాపూర్ వరకు నాలుగులేన్ల రహదారి పనులను వేగవంతంగా నడుస్తుండటంతో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. దీంతో కృష్ణాతీర ప్రాంతాల్లో ఉన్న నీటి ముంపు భూములపై రియల్ వ్యాపారులు కన్నేశారు. ఇదే అదునుగా భావించి సదరు భూములను పూర్వపు రైతులు అమ్మకానికి పెట్టేశారు. ముంపు భూములకు పరిహారం పొందిన రైతులు ఎలా అమ్మకానికి పెడతారని కొల్లాపూర్ నియోజకవర్గంలోని పెంట్లవెల్లి మండలం మల్లేశ్వరం గ్రామానికి చెందిన రైతులు అడ్డుకుంటున్నారు. తమకేమీ పట్టనట్లు కొందరు భూముల విక్రయానికి తెగబడుతున్నారు. మల్లేశ్వరం గ్రామ శివారులో ఏకంగా 106 ఎకరాల భూమిని అమ్మేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం వీరంతా ఆంధ్రప్రదేశ్‌లో నివాసం ఉంటున్నారు. అప్పుడప్పుడు వచ్చి నీటి మునక భూములను ఈ ప్రాంత రైతులకు కౌలుకు ఇచ్చి డబ్బులు తీసుకెళ్లేవారు. కానీ ఏకంగా భూముల ధరలకు రెక్కలు రావడంతో విక్రయించేందుకు పూనుకున్నారు. ఇదిలా ఉంటే గ్రామ అవసరాల కోసం పదెకరాల భూమిని ఇవ్వాలని అందులో గుడి నిర్మాణం చేపడుతామని మల్లేశ్వరం గ్రామస్థులు భూ విక్రయదారుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు తిరస్కరించారు. దీంతో గుట్టుగా ఉన్న ఈ వ్యవహారమంతా బయటపడింది. ప్రభుత్వానికి చెందిన భూములను ఎలా అమ్ముతారని భూములను అమ్మనిచ్చేదేలేదని గ్రామస్థులు విక్రయదారులకు తేల్చి చెప్పారు. దీంతో నీటి ముంపు భూముల విక్రయ దందా రెవెన్యూ అధికారుల దృష్టికి వెళ్లడంతో రెవెన్యూ అధికారులు ముంపు భూములను క్రయ విక్రయాలు జరిపితే చర్యలు తప్పవని గ్రామంలో దండోరా వేయించారు. ముంపు భూమలను సాగుచేసుకొని జీవనోపాధి పొందుతున్నామని, వాటిని విక్రయిస్తే తాము జీవనోపాధి కోల్పోతామని స్థానికులు రెవెన్యూ అధికారులతో మొర పెట్టుకుంటున్నారు. ఏది ఏమైనా ముంపు భూములను వ్యాపారుల చేతిలోకి వెళ్లకుండా ప్రభుత్వం కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.



ముంపు భూములు విక్రయించొద్దు

శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణంలో నీటి ముంపునకు గురైన భూములే తమ జీవనోపాధికి ఆధారంగా మారాయి. నీటి నిల్వ తగ్గినప్పుడు భూముల్లో పంటలు వేసుకుని కుటుంబాలను పోషించుకుంటున్నాం. భూముల ధరలకు రెక్కలు రావడంతో నీటి మునక భూములను కూడా విక్రయించేందుకు పూర్వపు యజమానులు సిద్ధమవుతున్నారు. దీనిని ప్రభుత్వం యంత్రాంగం అడ్డుకోవాలి.

- రవి, మల్లేశ్వరం గ్రామం

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జడ్చర్ల, జూలై 18 : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న మంగలి రాములు(75) గురువారం మృతి చెందినట్లు జడ్చర్ల ఏఎస్సై నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. జడ్చర్లలోని హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన రాములు ఈనెల 10న ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఏఎస్సై వివరించారు.

మానవత్వం చాటుకున్న ఎస్సై



అనాథ వృద్ధురాలిని చేరదీసి చికిత్స కోసం అంబులెన్స్ ఎక్కించడానికి తీసుకెళ్తున్న ఎస్సై సురేష్

అమరచింత, జూలై 18 : గుర్తు తెలియని ఓ అనాథ వృద్ధురాలికి చేయూతనిచ్చి వనపర్తి జిల్లా అమరచింత ఎస్సై సురేష్ గురువారం తన మానవత్వాన్ని చాటుకున్నారు. కొన్నిరోజుల క్రితం వృద్ధురాలు లక్ష్మమ్మ అమరచింతకు వచ్చింది. ఆ వృద్ధురాలికి కాలికి ఇన్‌ఫెక్షన్ అయి భిక్షాటన చేస్తూ బతుకుతోంది. రహదారి పక్కన పడుకొని ఉన్న వృద్ధురాలి పరిస్థితిని చూసిన ఎస్సై సురేష్ వెంటనే మునిసిపల్ సిబ్బందిని పిలిపించి పక్కనే ఉన్న హోటల్‌లో ఆమెకు బట్టలు మార్పించారు. అనంతరం భోజనం పెట్టి అంబులెన్స్‌ను పిలిపించారు. వృద్ధురాలి కాలికి ఇన్‌ఫెక్షన్ కావడంతో మెరుగైన వైద్యం కోసం వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా ఆ వృద్ధురాలు వనపర్తి మండలం అన్నారం గ్రామంగా తెలిసింది. ఎస్సై సురేష్ అనాథ వృద్ధురాలిపై చూపించిన మానవత్వాన్ని పలువురు కొనియాడారు. గ్రామ యువకులు డీసీ.రాజశేఖర్, మహంకాళి చంద్రశేఖర్ తదితరులు ఎస్సైకి సహకరించారు.

50 ఏళ్ల జమ్మి చెట్టుకు పునరుజ్జీవం

» పెబ్బేరు వేణుగోపాలస్వామి ఆలయ ఆవరణలో పునఃప్రతిష్ఠ



పెబ్బేరు వేణుగోపాలస్వామి ఆలయ ఆవరణలో నాటిన జమ్మి చెట్టు

పెబ్బేరు, జూలై 18 : వనపర్తి జిల్లా పెబ్బేరు మండల కేంద్రంలో వనపర్తికి వెళ్లే రహదారిలో రోడ్డుపై ఉన్న 50 ఏళ్ల జమ్మి చెట్టుకు ప్రజా ప్రతినిధులు, భక్తులు గురువారం పునరుజ్జీవం కల్పించారు. హైస్కూల్ వెనుక భాగంలో ఉన్న వేణుగోపాల స్వామి ఆలయంలో జమ్మి చెట్టును పునః ప్రతిష్ఠించారు. రోడ్డు వెడల్పులో భాగంగా పెబ్బేరు నుంచి వనపర్తి వెళ్లే రహదారిలో అంబేడ్కర్‌నగర్ సమీపంలో 50 ఏళ్ల క్రితం నుంచి ఉన్న జమ్మి చెట్టును ఎక్స్‌కవేటర్ సహాయంతో వేర్లతో సహా తొలగించి దానిని వేణుగోపాలస్వామి ఆలయ ఆవరణలో నాటారు. అయితే నాటిన చెట్టు పచ్చగా చిగురించినట్లుగా కనిపించడంతో భక్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఇలా 50 ఏళ్ల వయస్సు కలిగిన వృక్షాన్ని తీసి మరోచోట నాటడం అరుదుగా కనిపిస్తుంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

వనపర్తి రూరల్, జూలై 18 : రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన వనపర్తి జిల్లా పరిధిలోని చిట్యాల శివారులో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి పట్టణానికి చెందిన రాములు మేస్త్రీగా పనిచేస్తు జీవనాన్ని కొనసాగిస్తున్నాడు. రోజు మాదిరిగా మధ్యాహ్నం భోజనం చేసుకొని చిట్యాల రోడ్డు వైపు బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా మరో బైక్‌పై జడ్చర్లకు చెందిన న్యాయవాది శ్రీకాంత్ వనపర్తికి వస్తూ రెండు బైక్‌లు ఢీకొన్నాయి. దీంతో మేస్త్రీ రాములు కింద పడగా తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతన్ని అంబులెన్స్‌లో జిల్లా ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా, ప్రమాదం జరిగిన చోట రోడ్లు గుంతలుగా ఉన్నాయని, ఎటువంటి మరమ్మతులు చేపట్టకుండా గాలికి వదిలేశారని స్థానికులు తెలిపారు.

గ్రూప్-2 మాక్ పరీక్షకు దరఖాస్తు చేసుకోండి

మహబూబ్‌నగర్ అర్బన్, జూలై 18 : తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ స్టడీ సర్కిల్, తెలంగాణ మైనారిటీస్ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గ్రూప్-2 పరీక్ష రాసే మైనార్టీ యువతకు మాక్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి ఆర్. ఇందిర ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఈనెల 30లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆగస్టు 1, 2వ తేదీల్లో ఉదయం, మధ్యాహ్నం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. నూతన కలెక్టరేట్‌లోని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయం, లేదా ఉర్దూ ట్రైనింగ్ సెంటర్ వక్ఫ్ కాంప్లెక్స్‌లో సంప్రదించాలన్నారు. మరింత సమాచారం కోసం 9440075553 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ప్రమాదవశాత్తు సంపులో పడి వ్యక్తి మృతి



చంద్రయ్య (ఫైల్)

రేవల్లి, జూలై 18 : నీటి సంపులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన వనపర్తి జిల్లా రేవల్లి మండలం కొంకలపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మైలారం చంద్రయ్య(55), సరోజ ఇద్దరు దంపతులు. చంద్రయ్య బుధ వారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో ఇంటి ముందున్న నీటి సం పులో పడిపోయాడు. కొద్దిసేపటి తరువాత చంద్రయ్య పెద్ద కుమారుడు బయటికి వచ్చి నీటి సంపులో పడి ఉన్న తండ్రిని చూసి చుట్టుపక్కల వారిని పిలిచాడు. వారు వెంటనే చంద్రయ్యను సంపులో నుంచి బయటకు తీసి అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు.

గ్యాస్ లీకై ముగ్గురికి గాయాలు



పేలుడు ధాటికి ధ్వంసమైన ఇంటి తలుపులు

గోపాల్‌పేట, జూలై 18 : గ్యాస్ పొయ్యిని మరమ్మతు చేస్తుండగా గ్యాస్ లీకై ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం మున్ననూర్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సోడె వెంకటయ్య, చిట్టెమ్మ దంపతులు తమ సొంత పొలంలో వ్యవసాయ పనులు చేసుకుంటు జీవిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు ఉండగా వారు హైదరాబాద్‌లో ఉంటున్నారు. గురువారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఇండేన్ గ్యాస్ సిలిండర్ గ్రామానికి వచ్చింది. అయితే, తమ ఇంట్లో గ్యాస్ లీకవుతోందని, చూడాలని కోరుతూ సిలిండర్లు తీసుకొచ్చిన గోపాల్‌పేటలోని యశశ్రీ గ్యాస్ ఏజెన్సీకి చెందిన మండ్ల శంకర్‌ను వెంకటయ్య కోరాడు. భారత్ గ్యాస్ సిలిండర్‌ను తాను చూడనని చెప్పినా బలవంతంగా శంకర్‌ను తన ఇంటికి తీసుకెళ్లాడు. ఇంట్లోని వంటగదిలో గ్యాస్ సిలిండర్ వద్ద మరమ్మతులు చేస్తుండగా ఒక్కసారిగా పెద్ద శబ్దంతో గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. గమనిస్తున్న భార్యాభర్తలతో పాటు, శంకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గ్యాస్ సిలిండర్ పేలుడు ధాటికి ఇంట్లో ఉన్న వస్తు సామగ్రితో పాటు తలుపులు, బియ్యం బస్తాలు పగిలిపోయాయి. గమనించిన చుట్టుపక్కల వారు వెంటనే వారిని వనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్లు వెంకటయ్య కుమారుడు రవి తెలిపారు.

త్రీడేస్ టోర్నీలో మహబూబ్‌నగర్ గెలుపు



త్రీడేస్ టోర్నీలో విజయం సాధించిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జట్టు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూలై 18 : హైదరాబాద్‌లో జరిగిన హెచ్‌సీఏ త్రీడేస్ లీగ్ టోర్నీలో మహబూబ్‌నగర్ జట్టు సాయిసత్యసీసీ జట్టుపై 204 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. గురువారం మూడో రోజు రెండో ఇన్నింగ్స్‌లో మహబూబ్‌నగర్ జట్టు 50 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 187 పరుగులకు డిక్లేర్ చేసి, 320 పరుగుల టార్గెట్ ఇచ్చారు. జిల్లా జట్టులో గణేశ్ అర్ధసెంచరీ(56) పరుగులు చేయగా, శ్రీకాంత్ 24, హర్షవర్దన్ 12, రఫె 18, ఖాసీం 25 పరుగులు చేశారు. రెండో ఇన్నింగ్స్‌లో సాయిసత్యసీసీ జట్టు 32.5 ఓవర్లలో 115 పరుగులకు ఆలౌట్ అయ్యింది. జిల్లాలో బౌలర్లలో శ్రీకాంత్ యాదవ్ 4, జయసింహా 2, షాదాబ్ అహ్మద్ 3, గణేశ్ 1 , పరుగులు తీసి జట్టు విజయానికి కృషి చేశారు. జిల్లా జట్టు క్రీడాకారులు చక్కటి ప్రతిభ చాటి జట్టు విజయానికి కృషి చేయడం పట్ల జిల్లా క్రికెట్ సంఘం సెక్రటరీ రాజశేఖర్ అభినందించారు.

పీయూలో బాలికల హాస్టల్‌ను ప్రారంభించిన ఏబీవీపీ నాయకులు



పీయూ బాలికల హాస్టల్‌ను ప్రారంభిస్తున్న ఏబీవీపీ నాయకులు

పాలమూరు యూనివర్సిటీ, జూలై 18 : పాలమూరు యూనివర్సిటీలో నూతనంగా నిర్మించిన బాలికల హాస్టల్‌ను ఏబీవీపీ నాయకులు ప్రారంభించారు. బాలికలకు గదులు లేక ఒకే గదిలో 8 నుంచి 10 మంది వరకు విద్యార్థినులు ఉంటున్నారు. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల వర్చ్‌వల్‌గా ప్రారంభించినా ఆ భవనం ఇప్పటికీ విద్యార్థులకు అందుబాటులోకి రాలేదు. దీంతో గురువారం ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు నిరసన తెలుపుతూ ప్రారంభించారు. సీఎం ప్రారంభించిన భవనాలను తిరిగి ప్రారంభించడం తగదని యూనివర్సిటీ అధికారులు, మహబూబ్‌నగర్ రూరల్ మండల పోలీసులు విద్యార్థులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. శాంతియుతంగా ప్రారంభిస్తామని విద్యార్థులు చెప్పడంతో పీయూ రిజిస్ట్రార్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి, రూరల్ పోలీసుల పర్యవేక్షణలోనే బాలికల హాస్టల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పీయూలో విద్యార్థులు అవస్థలు పడుతుంటే అధికారులు, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వారు తెలిపారు. యూనివర్సిటీలో సమస్యలు పరిష్కరించకపోతే ఏబీవీపీ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ పీయూ కార్యదర్శి శివకుమార్, నాయకులు సతీష్, వేణుగోపాల్, శశికుమార్, శివప్రసాద్, ఓ ప్రకాష్, రవి, బాలరాజు, నీరేష్, శ్రీను, శ్రీధర్ కుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం బీఆర్‌ఎస్ శ్రేణుల ఆందోళన



జకినాలపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఆందోళన కారులతో మాట్లాడుతున్న విద్యుత్ శాఖ ఏఈ రమణి, ఎస్‌ఐ వీరబాబు

ఊర్కొండ, జూలై 18 : మండలంలోని జకినాలపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని ఊర్కొండపేట గ్రామంలో విద్యుత్ సరఫరాలో తరచుగా అంతరాయం జరుగుతున్నదని బీఆర్‌ఎస్ శ్రేణులు విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణలో గురువారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో తరుచుగా విద్యుత్ అంతరాయం ఏర్పడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. రాత్రి సమయాల్లో అనధికారికంగా విద్యుత్ సరఫరా నిలిపి వేస్తుండటంతో నిదుర లేని రాత్రులు గడుపుతున్నామని, దోమల బెడద ఎక్కువగా ఉండటంతో రోగాల బారిన పడుతున్నామని అన్నారు. ప్రభుత్వం 24 గంటలు సరఫరా చేస్తున్నామని ప్రకటిస్తున్నా విద్యుత్ అధికారుల తీరుతో తీవ్ర మనోవేదనకు గురవుతున్నామని తెలిపారు. విద్యుత్ అంతరాయం సరిచేయకుంటే పెద్దఎత్తున కల్వకుర్తి డీఈ కార్యాలయం ముట్టడి చేస్తామని పేర్కొన్నారు. అనంతరం విద్యుత్ శాఖ ఏఈ రమణి, ఎస్సై వీరబాబు నిరసన కారులతో మాట్లాడి విరమింపజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కృష్ణగౌడ్ తదితరులు ఉన్నారు.

నిషేధిత గుట్కా పట్టివేత

నారాయణపేట, జూలై 18 : నారాయణపేట జిల్లా కేంద్రంలోని సుభాష్‌రోడ్డు దగ్గర గురువారం రూ.7,350 విలువ చేసే నిషేధిక గుట్కా పట్టుపడింది. పేరుపళ్లకు నాగరాజ్ నిషేధిత గుట్కా టాస్క్ పోర్స్ పోలీసులు దాడులు చేసి పట్టుకున్నారు.

పేరుకే మన్ననూరు.. విధులు కలెక్టరేట్ నుంచి

» అసౌకర్యానికి గురవుతున్న చెంచు గిరిజనులు

» అధికారుల సౌలభ్యం కోసం జిల్లా కేంద్రానికి డీటీడీవో కార్యాలయం



మన్ననూరులోని డీటీడీవో కార్యాలయం

మన్ననూర్, జూలై 18 : చెంచు లంబాడ, ఎరుకల తెగలకు చెందిన గిరిజనులకు సౌకర్యంగా ఉండాలనే ఉద్దేశంతో 1987లో అప్పటి మంత్రి మహేంద్రనాథ్ అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామంలో మాడా కార్యాలయాన్ని నిర్మించారు. 2016లో డీటీడీవో కార్యాలయంగా ప్రభుత్వం మార్చగా కొందరు అధికారుల సౌలభ్యం కొరకు ఉన్నతాధికారులను రప్పించి నాగర్‌కర్నూలు జిల్లా కలెక్టరేట్‌లోని ఓ భవనంలో కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. ఉద్యోగుల వేతనాలు సైతం మన్ననూరు నుంచే తీసుకుంటున్నారు. కార్యాలయ ఫర్నీచర్‌ను కూడా కొనుగోలు చేసి జిల్లా కేంద్రం కార్యాలయంలో బిగించారు. రెండేళ్లకు పైగా ఈ తంతు నడుస్తున్నా ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు ఎవరూ పట్టించుకోకపోగా అధికారులు యథావిధిగా జిల్లా కేంద్రం నుంచి డీటీడీవో కార్యాలయాన్ని నడిపిస్తున్నారు. రాష్ట్ర ఉన్నతాధికారులు, ముఖ్య కార్యక్రమాలు ఉన్నపుడే డీటీడీవో, ఏవో, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు మన్ననూరు డీటీడీవో కార్యాలయానికి వచ్చి వెళ్తున్నారు. గత నెలలో మన్ననూరులో పర్యటించిన రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ సెక్రటరీ శరత్ కు సైతం స్థానిక చెంచు గిరిజన సంఘాల నాయకులు డీటీడీవో కార్యాలయం అధికారులు లేక వెలవెలబోతోందని, జిల్లా కేంద్రానికి తరలించి నిర్వహిస్తున్నారని ఫిర్యాదు చేశారు.

పూర్తి స్థాయి కార్యాలయం, సిబ్బంది ఉన్నా..

గిరిజనులకు కావాల్సిన ప్రభుత్వ పథకాల అమలు జరుగాలంటే మన్ననూరు కేంద్రంగా ఉంటుందనే ఉద్దేశంతో మూడెకరాల విస్తీర్ణంలో కార్యాలయాన్ని నిర్మించారు. దీనికి అనుసంధానంగానే మన్ననూరులో ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ కార్యాలయం, జీసీసీ కార్యాలయాలు ఉన్నాయి. కార్యాలయంలో డీటీడీవో, ఏటీడీవో, ఏవో, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, కార్యాలయ సబార్డినేటరు, డిప్యూటీ ఈవో, ఏసీఎంవో, ఏసీఆర్‌పీ, కంప్యూటర్ ఆపరేటర్లతో కలిసి 13 మంది ఉద్యోగులు ఉన్నారు. 2016లో మాడా కార్యాలయాన్ని జీవో నెంబరు 753 ద్వారా డీటీడీవో కార్యాలయంగా అప్పటి ప్రభుత్వం మార్చింది. 2016 నుంచి 2021 దాకా మన్ననూరు నుంచే కార్యాలయం నడిచినా, మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం నుంచి వచ్చే కొంత మంది అధికారుల సౌలభ్యం కోసం నాగర్‌కర్నూలు జిల్లా కేంద్రం నుంచి డీటీడీవో కార్యాలయాన్ని నడిపిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. గిరిజనులు తమ సమస్యలను విన్నవించుకునేందుకు మన్ననూరు డీటీడీవో కార్యాలయానికి వస్తే అధికారులెవ్వరూ ఇక్కడ ఉండరు.

అందరూ జిల్లా కేంద్రంలో ఉంటారని తెలియడంతో కొందరు జిల్లా కేంద్రానికి వెళ్లి డీటీడీవోకు సమస్యలను విన్నవించుకుంటుండగా, చాలా మంది గిరిజనులు నిరాశగా వెళుతున్నారు.



కలెక్టరేట్‌లోని ఓ భవనంలో ఏర్పాటు చేసిన డీటీడీవో కార్యాలయం

మాడాను విలీనం చేయడం వల్లే మార్చాం

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మాడా కార్యాలయాన్ని డీటీడీవోలో విలీనం చేయడం వల్లనే పాలనా సౌలభ్యం కోసం కలెక్టరేట్ నుంచి నడిపించాల్సి వస్తోంది. జిల్లా కేంద్రం నుంచి వచ్చే వినతులను తీసుకుంటూనే, మన్ననూరులో గిరిజనుల నుంచి వచ్చే వినతులను తీసుకుంటూ, సమస్యల పరిష్కారానికి జిల్లా కేంద్రం నుంచే చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చిన తర్వాతనే మన్ననూరులో లేదా జిల్లా కేంద్రంలో డీటీడీవో కార్యాలయం ఉంటుందా అనే విషయం తెలుస్తుంది. తాము ఎక్కడైనా విధులు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నాం.

- డీటీడీవో కమలాకర్ రెడ్డి

డీఎస్సీ పరీక్ష ప్రారంభం

» ఆన్‌లైన్‌లో పరీక్ష » జిల్లాలో 1131 టీచర్ పోస్టులు

» పరీక్ష కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ జానకి, డీఈవో రవీందర్



ఫాతిమా విద్యాయలం పరీక్ష కేంద్రం వద్ద పరిశీలిస్తున్న ఎస్పీ జానకి, డీఈవో రవీందర్



హాల్ టికెట్ నెంబర్లు చూసుకుంటున్న అభ్యర్థులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 18 : ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 1131 పోస్టుల భర్తీకి ప్రభుత్వం డీఎస్సీ పరీక్ష ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తున్నది. అందులో భాగంగా పరీక్ష గురువారం ప్రారంభమైంది. ఈ పరీక్ష ఆగస్టు 5 వరకు జరగనుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా టెట్ అర్హత సాధించిన 40,402 మంది అభ్యర్థులు పరీక్ష కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇందుకు సంబంధించి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ధర్మాపూర్ సమీపంలోని జేపీఎన్‌సీఈ కళాశాల, క్రిస్టియన్ పల్లిలోని ఫాతిమా విద్యాలయంలో కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్ష ప్రతీ రోజు రెండు సెషన్స్‌లో నిర్వహిస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు నిర్వహిస్తున్నారు. ఫాతిమా విద్యాలయంలో నిర్వహించిన పరీక్ష కేంద్రాన్ని ఎస్పీ జానకి, డీఈవో ఎ.రవీందర్‌లు పరిశీలించారు. ధర్మాపూర్‌లోని జేపీఎన్‌సీఈ పరీక్ష కేంద్రంలో ఉదయం నిర్వహించిన పరీక్షకు 180 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా 158 మంది హాజరు కావాల్సి ఉండగా 22 మంది హాజరు కాలేదు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 180 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 163 మంది హాజరు కాగా 17 మంది హాజరు కాలేదు. ఫాతిమా విద్యాలయంలో నిర్వహించిన పరీక్ష కేంద్రంలో ఉదయం నిర్వహించిన పరీక్షకు 184 మంది హాజరు కావాల్సి ఉండగా 166 మంది హాజరయ్యారు. 18 మంది హాజరుకాలేదు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 184 మందికి గాను 160 మంది అభ్యర్థులు హాజరుకాగా, 24 మంది హాజరుకాలేదు. అభ్యర్థులు గంట ముందే చేరుకోవడంతో పరీక్ష కేంద్రాల వద్ద సందడి కనిపించింది.



జేపీఎన్‌సీఈ పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న అభ్యర్థులు

చిరుత దాడిలో లేగదూడ మృతి

» వెల్కిచర్లలో చిరుత వేలిముద్రల గుర్తింపు



చిరుత దాడిలో మృతి చెందిన లేగ దూడ

భూత్పూర్, జూలై 18 : మండలంలోని వెల్కిచర్ల గ్రామ శివారులో చిరుత సంచారం గ్రామస్థులకు భయభ్రాంతులను చేసింది. రెండు రోజుల క్రితం అదే గ్రామానికి చెందిన రైతు తిరుపతిరెడ్డికి సంబంధించిన లేగ దూడను చిరుత దాడి చేసి చంపితిన్నది. విషయాన్ని గమనించిన వెల్కిచర్ల గ్రామ రైతులు జిల్లా కేంద్రంలో ఉన్న ఫారెస్టు అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ సందర్భంగా గురువారం ఫారెస్టు బీట్ అధికారి రాఘవేందర్‌రెడ్డి, ఇతర అధికారులు రైతు తిరుపతిరెడ్డి వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించారు. చిరుత దూడను చంపి తిన్న ప్రాంతాన్ని పరిశీలించారు. చిరుత పాద ముద్రలను ఫారెస్టు అధికారులు పరిశీలించారు. ఇది కచ్చితంగా చిరుత అని అధికారులు నిర్ధారించారు. చిరుత నివశించే ప్రాంతం నుంచి 40 కిలో మీటర్ వరకు రాత్రి 12 నుంచి తెల్లవారు జామున 4 గంటల వరకు తిరుగుతుందని ఫారెస్టు బీట్ అధికారి స్పష్టం చేశారు. రైతులు చాలా జాగ్రత్తగా ఉండాలని ఫారెస్టు అధికారులు సూచించారు. పశువులను, ఇతర జీవాలను జాగ్రత్తగా చూసుకోవాలని రైతులకు సూచించారు. అదే విధంగా రాత్రి సమయాల్లో వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లే రైతులు సామాన్య జనాలు చాలా జాగ్రత్తగా ఉండాలని ఫారెస్టు అధికారులు సూచించారు. చనిపోయిన లేగదూడను పశువైద్యాధికారులతో పోస్టుమార్టం నిర్వహించారు. ప్రభుత్వం రైతుకు పరిహారం అందే విధంగా చర్యలు తీసుకుంటామని ఫారెస్టు బీట్ అధికారి రాఘవేందర్‌రెడ్డి స్పష్టం చేశారు.



చిరుత పాదముద్రను గుర్తించిన ఫారెస్టు అధికారులు

వ్యక్తిపై దాడికి చిరుత యత్నం

ఖిల్లాఘణపురం, జూలై 18 : వనపర్తి జిల్లా ఖిల్లాఘనపురం మండలంలోని ఆముదంబండ తండా బృహత్ పల్లెప్రకృతి వనం వద్ద గురువారం ఉదయం ద్విచక్ర వాహనంపై వస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది పరమేష్‌పై చిరుత దాడికి ప్రయత్నించింది. మామిడిమాడలో విధులు నిర్వహిస్తున్న పరమేష్ గురువారం ఉదయం వెనికితండాలో కరెంట్ బ్రేక్‌డౌన్ కావడంతో సరిచేసి వస్తుండగా ఆముదంబండ తండా శివారులోని ప్రధాన రహదారిపై చిరుత ఒక్కసారిగా దూకి తనపై దాడికి యత్నించిందన్నారు. వెంటనే వాహనం వేగం పెంచి తప్పించుకున్నట్లు పరమేష్ వివరించారు. గతంలోను అదే ప్రాంతంలో మామిడిమాడకు చెందిన ఆర్‌ఎంపీ డాక్టర్‌పై చిరుత దాడికి యత్నించిన ఘటనలు ఉన్నాయి. గత కొన్నినెలలుగా మండలంలో చిరుత సంచరిస్తోందని, అటవీ శాఖ అధికారుల దృష్టికి బాటసారులు తెలియజేసినా చిరుతను బంధించడం లేదని మండల ప్రజలు వాపోతున్నారు. కర్నే తండా శివారు, పరిసర గ్రామాల్లోని ప్రధాన రహదారులపై ద్విచక్ర వాహనదారులు రావడానికి భయపడుతున్నారు.

త్వరలోనే 'మల్లమ్మకుంట' నిర్మాణ పనులు

» భూములు కోల్పోయే రైతులకు న్యాయం చేస్తాం

» ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ » రిజర్వాయర్ నిర్మాణ స్థలం పరిశీలన



తనగలలో రైతులతో మాట్లాడుతున్న సంపత్‌కుమార్

వడ్డేపల్లి, జూలై 18 : రైతుల దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం ప్రభుత్వం మల్లమ్మకుంట రిజర్వాయర్ నిర్మాణ పనులను త్వరలోనే చేపట్టనున్నదని ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ అన్నారు. రిజర్వాయర్ నిర్మాణంలో భూములు కోల్పోనున్న రైతులందరికీ ప్రభుత్వం అన్ని విధాలా న్యాయం చేస్తుందని చెప్పారు. వడ్డేపల్లి మండల పరిధిలోని తనగల గ్రామం వద్ద, మల్లమ్మకుంట రిజర్వాయర్ నిర్మించనున్న స్థలాన్ని గురువారం ఆర్డీఎస్, నీటి పారుదల శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రిజర్వాయర్ నిర్మాణం, డిజైన్ తదితర వివరాలను అధికారులు సంపత్‌కుమార్‌కు వివరించారు. అనంతరం రైతులతో సమావేశం నిర్వహించి, రిజర్వాయర్ నిర్మాణంతో కలిగే ప్రయోజనాలు, విధివిధానాలపై చర్చించారు. అధికారుల సూచనలు సేకరించి, రైతుల అనుమతితోనే ప్రభుత్వం భూ సేకరణ మొదలు పెడుతుందని తెలిపారు. రైతులకు ఎదురయ్యే ప్రతీ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, న్యాయం చేస్తామని చెప్పారు. గత ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలతో ఆర్డీఎస్ సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపలేకపోయిందన్నారు. వందల కోట్లు వెచ్చించి తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారని, కానీ రిజర్వాయర్లు నిర్మించక పోవడం గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. విషయాన్ని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. భూసేకరణ కోసం అధికారులు రైతులతో చర్చిస్తారని, ఆర్డీఎస్ డిస్ట్రిబ్యూటరీ 40 వరకు సాగు నీరు అందించి రైతులకు శాశ్వత పరిష్కారం చూపిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డీఎస్ సాగునీటి సంఘం మాజీ చైర్మన్ తనగల సీతారాంరెడ్డి పాల్గొన్నారు.

బస్సు కింద పడి మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

పెంట్లవెల్లి, జూలై 18 : మతిస్థిమితం లేని వ్యక్తి బస్సు కింద పడి మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండల పరిధిలోని గోప్లాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన కథనం ప్రకారం.. పెంట్లవెల్లి మండలం గోప్లాపూర్ గ్రామంలో గురువారం సాయంత్రం పీర్ల పండుగ సందర్భంగా పీర్లను ఊరేగిస్తుండగా వనపర్తి నుంచి కొల్లాపూర్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు కింద తూర్పాటి సత్యాలు (25) మతి స్థిమితం లేని యువకుడు బస్సు కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

బైక్ అదుపు తప్పి ఇద్దరికి గాయాలు

గద్వాల, జూలై 18 : జోగుళాంబ గద్వాల జిల్లా, మానవపాడు మండలంలోని బోరవెల్లి స్టేజీ సమీపంలో బైక్ అదుపుతప్పి కింద పడటంతో ఇద్దరు గాయపడ్డారు. హైవే సిబ్బంది తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపురం గ్రామానికి చెందిన శ్రీనివాస్, భవానీ గురువారం ద్విచక్రవాహనంపై కర్నూలుకు బయలుదేరారు. బోరవెల్లి స్టేజీ సమీపంలో వాహనం అదుపుతప్పి కిందపడటంతో ఇద్దరూ గాయపడ్డారు. హైవే సిబ్బంది స్పందించి వారిని అంబులెన్స్‌లో కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

యువకులపై దాడి, పోలీసులకు ఫిర్యాదు

మల్దకల్, జూలై 18 : జోగుళాంబ జిల్లా మల్దకల్ మండలంలోని మద్దెలబండ గ్రామానికి చెందిన ఇద్దరు యువకులపై మండల కేంద్రానికి చెందిన వారు దాడి చేశారు. ఘటనపై ఏఎస్‌ఐ ఈశ్వరయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మద్దెలబండకు చెందిన ముత్యాల ప్రసన్న బాబు, ప్రభుదాసు అయిజలోని మెకానిక్ షాపులో పని చేస్తున్నారు. బుధవారం రాత్రి పని ముగించుకొని బస్సుకోసం మద్దెలబండ రాస్తాలో వేచి ఉన్నారు. ఆ సమయంలో అక్కడే ఉన్న గోవర్దన్, తిరుమలేష్, నడ్డోడులు వారితో గొడవకు దిగి కులం పేరుతో దూషిస్తూ దాడి చేశారు. ఈ మేరకు బాధితులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జీహెచ్‌ఎం, ఉపాధ్యాయుడికి షోకాజ్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 18 : ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీల కమిటీలో ఉంటూ విధులపట్ల నిర్లక్ష్యం వహించిన గెజిటెడ్ హెడ్మాస్టర్‌కు, స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుడికి విద్యాశాఖ అధికారి ఎ.రవీందర్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ నెల 16న వీరికి నోటీసులు జారీ చేశారు. విషయాన్ని బయటకు తెలియకుండా గోప్యంగా ఉంచారు. ఈ నోటీసులు జారీ చేసినట్లు చేసి వారి నుంచి వివరణ కూడా తీసుకుని వదిలేశారు. అయితే దీనిపై తెలంగాణ పీఆర్టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు, టీసీసీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి సీరియస్ కావడంతో ఈ విషయం మీడియా దృష్టికి వచ్చింది. భాషాపండితుల అప్‌గ్రేడ్ కమిటీలో ఉంటూ వీరు తప్పుడు సమాచారం ఇచ్చినట్లు పలువురు బాధితులు హర్షవర్ధన్‌రెడ్డి దృష్టికి తీసకురావడంతో దీనిపై డీఈవో ప్రశ్నించారు. ఇద్దరు ఉపాధ్యాయులకు పదోన్నతుల విషయంలో అన్యాయం జరగడంపై తీవ్రంగా మండిపడ్డట్లు తెలిసింది. దీనిపై డీఈవో రవీందర్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా కమిటీలో ఉన్న జీహెచ్‌ఎం రవీపాల్, స్కూల్‌అసిస్టెంట్ గిరిజ రమణలకు షోకాజ్ నోటీస్‌లు ఇచ్చినట్లు తెలిపారు.

ఆగి ఉన్న కారును ఢీకొన్న మరో కారు

ఉండవల్లి, జూలై 18 : జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండల పరిధిలోని బైరాపురం చౌరస్తా సమీపంలో రోడ్డు పక్కన ఆగి ఉన్న కారును, వెనుక నుంచి వచ్చిన మరో కారు ఢీకొన్నది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ ప్రాంతానికి చెందిన అమీనుద్దీన్ షరాబ్ కుటుంబ సభ్యులతో కలసి కారులో బైరాపురం శివారులోని తన పొలాన్ని చూసేందుకు వచ్చారు. కారును రోడ్డు పక్కన నిలిపి పొలం చూసేందుకు వెళ్లారు. అదే సమయంలో మహబూబ్‌నగర్ నుంచి అలంపూర్ క్షేత్రానికి వెళ్తున్న మరో కారు రోడ్డుపక్కన నిలిపి ఉంచిన కారును ఢీకొన్నది. ప్రమాదంలో రెండు కార్లు దిబ్బతిన్నాయి. ప్రయాణికులు అందరూ క్షేమంగా ఉన్నారు. అమీనుద్దీన్ పిర్యాదు మేరకు కారు డ్రైవర్ క్షణయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు నాయక్ తెలిపారు.

స్పౌజ్ పాయింట్ల దుర్వినియోగం ఫైలు డీఎస్ఈకి

- ఆదేశాలు వచ్చిన వెంటనే చర్యలు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 18 : గత సంవత్సరం సెప్టెంబరులో జరిగిన ఉపాధ్యాయుల బదిలీలో స్పౌజ్ పాయింట్లు దుర్వినియోగం చేసినట్లు తేలడంతో విచారణ చేసిన అధికారులు ఆ ఫైల్‌ను డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ (డీఎస్ఈ) హైదరాబాద్‌కు పంపినట్లు తెలిసింది. ప్రధానోపాధ్యాయుల బదిలీల్లో పలువురు ప్రధానోపాధ్యాయులు స్పౌజ్ పాయింట్లు ఉపయోగించుకొని విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా వెబ్‌ఆప్షన్ ఇచ్చి కొందరు హెచ్‌ఆర్‌ఏ ప్లేసులు పొందారు. మరికొందరు తమకు అనుకూలంగా ఉన్న పాఠశాలలు తీసుకోగా, కొందరు విద్యార్థులు తక్కువ ఉన్న పాఠశాలలను తీసుకొని నిబంధనలకు తూట్లు పొడిచారు. అసలు స్పౌజ్ పాయింట్లు బదిలీలలో భార్యాభర్తలు తీసుకుంటే వారు ఒకే పాఠశాలలో కానీ, సమీప పాఠశాలలో కానీ, అవి దొరకనప్పుడు సమీప మండలాలు తీసుకోవాలని నిబంధనలు ఉన్నాయి. కానీ, వారుమాత్రం ఆన్‌లైన్ ఆప్షన్లలో హెచ్‌ఆర్‌ఏ ప్రాంతాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిసింది. మొత్తంగా గత ఆరేడు నెలల్లో 15 మంది జీహెచ్‌ఎంలకు రెండు సార్లు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. దీనిపై పూర్తి వివరాలను ఆర్జేడీ తెప్పించుకొని పూర్తిగా పరిశీలించి, జిల్లా విద్యాశాఖ నుంచి వచ్చిన వివరాలు, హెచ్‌ఎంలు బదిలీల సమయంలో వచ్చిన వివరాలను డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ (డీఎస్ఈ)కు పంపించినట్లు ఆర్జేడీ 'ఆంధ్రజ్యోతి'తో తెలిపారు. అక్కడి నుంచి ఫైలు వచ్చిన వెంటనే చర్యలు ఉంటాయని తెలిపారు. ఇందుకు సంబంధించిన ఫైలు నేడో, రేపో వచ్చే అవకాశం ఉందని, ఏడుగురు హెచ్‌ఎంలపై వేటు పడే అవకాశం ఉన్నట్లు ఓ ఉపాధ్యాయ సంఘం నాయకుడు తెలిపారు.

రుణమాఫీ డబ్బులు రైతులకు వెంటనే చెల్లించాలి

- బ్యాంకర్లను ఆదేశించిన కలెక్టర్ విజయేందిర బోయి



బ్యాంక్ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్ నగర్ (కలెక్టరేట్), జూలై 18 : బ్యాంకులు రుణమాఫీ డబ్బులు వెంటనే రైతులకు చెల్లించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్ సమావేశం హాల్‌లో నిర్వహించిన బ్యాంక్ అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఈ రోజు రైతు రుణమాఫీ తొలివిడతలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 39, 380 రైతుల ఖాతాల్లో రూపాయలు 211 కోట్లు జమ అవుతాయని తెలిపారు. ఈ పథకం ద్వారా 37, 372 కుటుంబాలు రుణవిముక్తులు అవుతారని వివరించారు. ఇట్టి రైతులకు వెంటనే కొత్త రుణాలు ఇచ్చి వారి పెట్టు బడికి సహాయం చేయాలని కలెక్టర్ బ్యాంక్ అధికారులను ఆదేశించారు. ఇట్టి రుణ మాఫీ డబ్బులు ఇతరుల ఖాతాల్లో జమచేయరాదని, రైతుల ఇతర ఖాతాల్లో జమచేయరాదని ఆమె ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న మరో ప్రతిష్ఠాత్మక కార్యక్రమం ఇందిరమ్మ మహిళా శక్తికి చెందిన అన్ని పథకాలకు రుణాలు ఇవ్వాలని బ్యాంక్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నారాయణ పేటా జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, మహబూబ్ నగర్, నారాయణ పేట జిల్లాల అదనపు కలెక్టర్‌లు శివేంద్ర ప్రతాప్, మయాంక్ మిట్టల్, ఎల్‌డిఎం లు కల్వ భాస్కర్, విజయకుమార్, వ్యవసాయ అధికారి వెంకటేశ్, డిఆర్డీఓ ఏపిడి జోజప్ప, బ్యాంక్ అధికారులు నర్మద, రవికిశోర్ రెడ్డి, మురళీక్రిష్ణ, ప్రసాద్ పాత్రో, అన్ని బ్యాంకుల కంట్రోలర్లు, బ్యాంక్ మేనేజర్లు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడి చిత్రపటానికి నివాళి



జడ్చర్ల : రామస్వామిగుట్టతండాలో హీర్యానాయక్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

జడ్చర్ల/ బాలానగర్, జూలై 18 : జడ్చర్ల మండలం పెద్దఆదిరాల గ్రామ పంచాయతీలోని రామ స్వామిగుట్ట తండాలో బీఆర్ఎస్ పార్టీ నాయకుడు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ హీర్యా నాయక్ ఇటీవల మృతిచెందాడు. గురువారం బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సి.లక్ష్మారెడ్డి ఆ గ్రామానికి వెళ్లి హీర్యానాయక్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కోడ్గల్ యాదయ్య, వాల్యానాయక్, రఘుపతిరెడ్డి, శంకర్ నాయక్, ఇంతియాజ్ ఖాన్, శ్రీకాంత్ ఉన్నారు.

● మండల కేంద్రమైన బాలానగర్‌లో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసరావు మాతృమూర్తి ఇటీవల మృతి చెందింది. గురువారం మాజీ మంత్రి డాక్టర్ సి. లక్ష్మారెడ్డి ఆ గ్రామానికి వెళ్లి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట తప్పని ప్రభుత్వం మాది

- పీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అక్తర్

నవాబ్‌పేట, జూలై 18 : గడిచిన ఎన్నికల్లో రైతులకు రూ. 2లక్షలు రుణమాఫీ చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దాన్ని అమలు చేసి మాట నిలుపుకున్నారని పీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అక్తర్ అన్నారు. గురువారం నవాబ్‌పేటలో పార్టీ మండల అధ్యక్షుడు నీరటి రామచంద్రయ్య, బంగ్ల రవి, ఆళ్ల భూపాల్ రెడ్డి, కామారం నవాజ్ రెడ్డి, సీల్యానాయక్, అజహర్, కోట్ల రాజేష్, మరికంటి వెంకటయ్య తదితరులతో కలిసి ముఖ్యమంత్రి రెవంత్ రెడ్డి, ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. రైతుల గోస గుర్తించిన ముఖ్యమంత్రి రుణమాఫీ చేసి తన మాట నిలుపుకున్నారని అన్నారు. అంతకు ముందు రుద్రారం రైతు వేదికలో జరిగిన రైతు రుణమాఫీ సదస్సుకు మండల ప్రత్యేకాధికారి పద్మ, ఏవో కృష్ణకిషోర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో రఘువీర్ శర్మ, పుట్టి ఆంజనేయులు, శివకుమార్, శంకర్ నాయక్, అంజన్‌కుమార్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, రంగారెడ్డి, భాస్కర్ నాయక్, తానెం సురేష్, బెస్త సూరి, తీగలపల్లి ఆశన్న, భీమయ్య వివిధ గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- వార్డుల్లో పర్యటించిన మునిసిపల్ చైర్మన్

భూత్పూర్, జూలై 18 : డెంగీ, విషయ జ్వ రాలు వంటివి ప్రబ లకుండా ఉండాలంటే ప్రతీ ఒక్కరు వారి పరి సరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ముని సిపల్ చైర్మన్ బస్వ రాజుగౌడ్ అన్నారు. గురువా రం మునిసిపా లిటీలోని 4, 10వ వార్డుల్లో ఆయ న స్థానిక మునిసిపల్ అధికారులు, సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం డెంగీ, విష జ్వరాలు వంటివి ప్రబలుతున్నాయని, మీ ఇంటి పరిసరాల్లో మురుగు నీరు, అదే విధంగా ఇంటి వద్ద కూలర్లల్లో, చెత్తకుండీల్లో, పాత టైర్లలో నీరు నిలువలేకుండా చూసుకోవాలని స్థానిక ప్రజలకు, మహిళలు మునిసిపల్ చైర్మన్ సూచించారు. చాలా మంది ఇళ్ల వద్ద పరిసరాలను శుభ్రంగా పెట్టుకోకుండా చెత్త, చేదారం, నీటి నిలువలు, కంపచెట్లతో, దోమలకు నిలయాలుగా మార్చుకొని ఉంటారని, అలా కాకుండా చాలా జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. మీరు పరిశుభ్రంగా ఉంచుకోలేని పరిస్థితిలో ఉంటే మునిసిపాలిటీ సిబ్బందికి సమాచారం అందిస్తే వారు వచ్చి చెత్తాచెదారాన్ని తొలగిస్తారని అన్నారు. ఈయన వెంట స్థానిక మునిసిపాలిటీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అమ్మమాట-అంగన్‌వాడీ బాట

జడ్చర్ల, జూలై 18 : ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జడ్చర్ల మునిసిపాలిటీలోని కావేరమ్మపేట సెక్టార్‌లోని ఇందిరానగర్ అంగన్‌వాడీ కేంద్రంలో అమ్మమాట-అంగన్‌వాడీబాట కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. రెండున్నర సంవత్సరాలు నిండిన పిల్లలందరినీ అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలంటూ తల్లులకు ఐసీడీఎస్ సీడీపీవో మెహరున్నిసాబేగం సూచించారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఆటపాటలతో విద్య (ప్రాథమిక విద్య)ను అందించనున్నట్లు వెల్లడించారు. 2020 ఎడ్యుకేషన పాలసీ ప్రకారం ఐదేళ్లలోపు పిల్లలందరికీ పూర్వ ప్రాథమిక విద్యను అందించాలని ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు చంద్రకళ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుగుణ, టీచర్స్ అంజనమ్మ, అంజలి, విజయకుమారి, యాదమ్మ, సరోజ పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలి

- పీయూ పరీక్షల విభాగం కంట్రోలర్ రాజ్‌కుమార్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 18 : విద్యార్థులు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఓ లక్ష్యంతో ముందుకు నడవాలని పాలమూరు యూనివర్సిటీ పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ రాజ్‌కుమార్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని స్వామి వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థుల తరగతుల ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు మొదటి నుంచే ఓ లక్ష్యం ఏర్పర్చుకోవాలన్నారు. డిగ్రీ పరీక్షలు పూర్తి అయిన తర్వాత పోటీ పరీక్షలలో తమ సత్తా ఏంటో నిరూపించుకోవాలంటే ఇప్పటి నుంచే కష్టపడి ఇష్టపడి చదవాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఇబ్రహీం ఖలీల్, ప్రిన్సిపాల్ కుమారస్వామి, వైస్‌ప్రిన్సిపాల్ రాజేశ్వరి, డీన్ డాక్టర్ హీరోజీరావు బోస్లే, అధ్యాపకులు పాల్గొన్నారు.

పాలమూరులో బీసీ కళాశాల హాస్టల్ ఏర్పాటు చేయాలి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 18 : పాలమూరు పట్టణంలో బీసీ కళాశాల వసతి గృహం ఏర్పాటు చేయాలని గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ హాస్టల్ కోసం పాత డీఈవో కార్యాలయం ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వసతి గృహం లేకపోవడంతో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయనకు వివరించారు. విద్యార్థుల సౌకర్యం కోసం పాత డీఈవో కార్యాలయం వసతి గృహం కోసం ఇవ్వనున్నట్లు ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలిపారు.

నేడు అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

దేవరకద్ర, జూలై 18 : మహబూబ్‌నగర్ నుంచి తమిళనాడులోని అరుణాచలం గిరి ప్రదక్షిణకు ఆర్‌టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆ సంస్థ అధికారులు శ్రీనివాస్‌రావు, బాలస్వామి తెలిపారు. గురువారం మండల కేంద్రంలో తిరుగుతూ ఈ నెల 19వ తేదీన మహబూబ్‌నగర్ నుంచి అరుణాచలానికి ప్రత్యేక బస్సును నడుపుతున్నట్లు ప్రజలకు అవగాహన చేస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. 21న పౌర్ణమి సందర్భంగా అరుణాచలానికి మన రాష్ట్రం నుంచి వేలాది మంది భక్తులు వెళ్తుంటారని తెలిపారు. ఆర్‌టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు తెలిపారు. ప్రయాణికులు ఆర్‌టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమన్నారు. అరుణాచలం వెళ్లే ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.



మిడ్జిల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి వీసీ తిలకిస్తున్న కలెక్టర్ విజయేందిర



జడ్చర్లలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



భూత్పూరు : ఎండ్ల బండిపై మూసాపేట రైతువేదికకు వస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

రుణ మాఫీ.. రైతు హ్యాపీ

- రైతులకు చరిత్రాత్మకమైన దినం
- ట్విట్టర్ టిల్లు కేటీఆర్, హరీశ్‌రావులు సిగ్గు లేకుండా మాట్లాడుతున్నారు
- హరీశ్‌రావు రాజకీయ సన్యాసం తీసుకోవాలి
- రైతు రుణాన్ని ఏకకాలంలో మాఫీ చేశాం

- సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే యెన్నం

హన్వాడ, జూలై 18 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులు తీసుకున్న రుణాన్ని ఏకకాలంలో మాఫీ చేసిన ఈ రోజు చరిత్రాత్మకమైన దినమని పాలమూర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం ముఖ్యమంత్రి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌ను టంకర రైతు వేదికలో ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకులు, అధికారులు పాల్గొని వీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ట్విట్టర్ టిల్లు కేటీఆర్, హరీశ్‌రావులు సిగ్గు లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. వారి మెదడు మోకాళ్లలోకి వెళ్లిందని, అందుకే హామీలు అమలు చేయడం లేదని మీడియా ముందు మాట్లాడుతున్నారని ఆరోపించారు. హామీల అమలులో భాగంగా ఈ రోజు రుణమాఫీ చేశామన్నారు. ఇప్పుడు హరీశ్‌రావు రాజకీయ సన్యాసం తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మోహన్‌రావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా, రాష్ట్ర నాయకులు వినోద్‌కుమార్, ఎస్పీ వెంకటేష్, సురేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మహేందర్, వెంకటాద్రి, లక్ష్మన్, సిరాజ్‌ఖాద్రి, కలీమ్, తిరుపతయ్య, మోహన్ పాల్గొన్నారు.

● హన్వాడలో ర్యాలీ : రుణమాఫీ చేస్తున్న సందర్భంగా గురువారం హన్వాడలో ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకులు బైక్‌ర్యాలీ నిర్వహించారు. పటాకులు కాల్చి సంబురాలు చేసుకున్నారు.

రైతు రుణమాఫీ నా జీవితంలో మర్చిపోలేని రోజు

● మూసాపేటలో రైతులతో కలిసి సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

భూత్పూర్ : రైతు రుణ మాఫీలో భాగంగా గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మూసాపేటలోని రైతు వేదిక వద్ద ఏర్పాటు చేసిన రైతుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుందని అన్నారు. ఈ శుభదినాన్ని నా జీవితంలో మర్చిపోలేనని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అంతకు ముందు అడ్డాకుల టోల్ ప్లాజా నుంచి మూసాపేట వరకు ర్యాలీగా వచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మూసాపేట మండల అధ్యక్షుడు శెట్టి శేఖర్, భూత్పూర్ మండల అధ్యక్షుడు కేసీరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి వచ్చిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు, రైతు కూలీలు పాల్గొన్నారు.

మండల రైతువేదిక వద్ద ఏర్పాటు చేసిన దృశ్యమాధ్యమం ద్వారా మండల రైతులు తిలకించారు. మండల ప్రత్యేక అధికారి వేణుగోపాల్‌రెడ్డి, ఏవో మురళీధర్, మాజీ వైస్ ఎంపీపీ నరేష్ కుమార్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందొద్దు : కలెక్టర్

మిడ్జిల్ : అర్హులుగా ఉండి రుణమాఫీ కాని రైతులు ఎవరైనా ఉంటే ఆందోళన చెందనవసరం లేదని కలెక్టర్ విజయేందిరబోయి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన రైతు రుణమాఫీ సంబురాలలో కలెక్టర్ పాల్గొన్నారు. రైతులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌ను తిలకించారు. సాంకేతిక కారణాల వల్ల అర్హత ఉండి రుణమాఫీ కాని రైతులు ఉంటే స్థానిక అధికారుల దృష్టికి తీసుకవస్తే రైతులకు రుణ మాఫీని వర్తింపజేసేందుకు వీలుంటుందన్నారు. పలువురు మహిళా రైతులు కలెక్టర్‌ను శాలువాలతో సన్మానించి, మిఠాయిలు తినిపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి, మండల ప్రత్యేకాధికారి వెంకటేష్, తహసీల్దార్ రాజునాయక్, ఎంపీడీవో గీతంజాలి, ఎంపీవో అనురాధ, ఏఓ సిద్ధార్థ, ఏఈవోలు, నాయకులు అల్వాల్‌రెడ్డి, వెంకటయ్య, గౌస్, సత్యంగుప్తా, మల్లికార్జున్‌రెడ్డి, బాల్‌రెడ్డి, కృష్ణయ్యగౌడ్, ఉస్మాన్, రాఘవరెడ్డి, నర్సింహ్మలతో పాటు పలువురు అధికారులు, పలు గ్రామాలకు చెందిన రైతులు తదితరులున్నారు.



కోయిలకొండలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కాంగ్రెస్ నాయకుల సంబురాలు

రాష్ట్ర ప్రభుత్వం పంటరుణ మాఫీ చేయడంతో గురువారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సంబురాలు చేసుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డిల చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నాయకులు అల్వాల్‌రెడ్డి, వెంకటయ్య, గౌస్, సత్యంగుప్తా, మల్లికార్జున్, వెంకటయ్య, బాల్‌రెడ్డి, కృష్ణయ్యగౌడ్, ఉస్మాన్, రాఘవరెడ్డి, నర్సింహ్మ, నిరంజన్, జంగయ్య, అధికారులు ఉన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతులే రాజులు

● దేవరకద్ర : కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే రైతులను రాజులను చేయడమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, అంజిల్‌రెడ్డి అన్నారు. రైతులకు రుణమాఫీ చేయడంతో గురువారం నియోజకవర్గంలోని దేవరకద్ర, కౌకుంట్ల మండలాలతో పాటు వివిధ గ్రామాల్లో ఆయా పార్టీ నాయకుల ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి చిత్రాపటాలకు క్షీరాభిషేకం చేశారు. నాయకులు, కార్యకర్తలు వ్యవసాయదికారులు, తదితరులు పాల్గొన్నారు.

అడ్డాకులలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

● అడ్డాకుల : ప్రభుత్వం రైతురుణమాఫీ చేయడంతో కృతజ్ఞతగా అడ్డాకులలో గురువారం రైతులు, కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డిల చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. సాయంత్రం ఎమ్మెల్యే జీఎంఆర్ ఆధ్వర్యంలో అడ్డాకుల టోల్‌గేట్ నుంచి మూసాపేట వరకు రైతులు ఎద్దుల బండ్లు, ట్రాక్టర్‌ల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తోట శ్రీహరి, జిల్లా కిసాన్‌సెల్ అధ్యక్షుడు నాగిరెడ్డి, మాజీ ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి విజయమోహన్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొండా జగదీశ్, దేవరకద్ర మైనార్టీసెల్ అధ్యక్షుడు షఫీహమ్మద్, హర్షవర్ధన్‌రెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శరత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

వీసీలో పాల్గొన్న రైతులు

● రాజాపూర్ : మండలంలోని రంగారెడ్డిగూడ గ్రామంలోని స్థానిక రైతు వేదికలో గురువారం ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఖాతాల్లో రుణమాఫీ డబ్బులను ఖాతాలో జమ చేసిన సందర్భంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులు, నాయకులు, అధికారులు పాల్గొని వీక్షించారు.



అడ్డాకుల : సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, రైతులు

కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ఆర్.ఇందిర, మండల వ్యవసాయ అధికారి నరేందర్, ఏఈవోలో శ్రీనివాస్, మోఘనాథ్, నాయకులు నరహరి, యాదయ్య శ్యాంమ్‌సుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి రైతుబాంధవుడు

● బాలానగర్ : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతు బాంధవుడని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. రైతు రుణమాఫీ అమలు చేయడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గురువారం మండల కేంద్రంలో పటాకులు కాల్చి హర్షం వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శంకర్‌నాయక్, నాయకులు వెంకట్‌రెడ్డి, మల్లారెడ్డి, రఘు యాదవ్, వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకట్ నాయక్, దశరథ్ నాయక్, తిరుమలయ్య యాదవ్, యాదయ్య, యాదయ్యగౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జడ్చర్లలో సంబురాలు

జడ్చర్ల : రైతు రుణమాఫీ అమలు సందర్భంగా గురువారం జడ్చర్ల రైతువేదిక వద్ద రైతులు సంబురాలు నిర్వహించారు. జడ్పీ సీఈవో రాఘవేందర్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సీఎం ప్రసంగాన్ని రైతులు వీక్షించారు. తెలంగాణ రాష్ట్ర సంగీత, నాటక అకాడమీ మాజీ చైర్మన్ బాద్మి శివకుమార్, కాంగ్రెస్ నాయకులు బుక్క వెంకటేశ్, బుర్ల వెంకటయ్య, నిత్యానందం, అయ్యన్న జనార్దన్‌రెడ్డి, గాంగ్యానాయక్, రాంప్రసాద్, నాయకులు, కార్యకర్తలు, వ్యవసాయశాఖ అధికారి గోపీనాథ్, ఏఈఓలు పాల్గొన్నారు.



రాజాపూర్ : సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రైతులు, నాయకులు, అధికారులు

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

ప్రభుత్వం రైతులకు రూ.1లక్ష రుణమాఫీ చేస్తున్న సందర్భంగా గురువారం జడ్చర్లలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి చిత్రపటాలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు క్షీరాభిషేకం చేసారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బాదిమి రవి శంకర్, కాట్రేపల్లి లక్ష్మయ్య, మినాజ్, టీవీ గౌడ్, ఖాజా, భాస్కర్‌రెడ్డి, తుంగరఘు, ఖాజాఅలీమొద్దీన్, గయాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇది రైతు సంక్షేమ ప్రభుత్వం

చిన్నచింతకుంట : కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమ ప్రభుత్వమని అప్పంపల్లి, ముచ్చింతల సింగిల్‌విండో చైర్మన్‌లు సురేందర్‌రెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డిలు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రభుత్వం రూ.1లక్ష రుణమాఫీ కార్యక్రమాన్ని సీఎం రేవంత్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించే కార్యక్రమంలో భాగంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొని వీక్షించారు. కార్యక్రమంలో స్పెషలాఫీసర్ శ్రీనివాసులు, తహసీల్దార్ కృష్ణయ్య ఏఓ రాజేష్‌ఖన్నా, యూనియన్ బ్యాంకు మేనేజర్ నరసింహరాజు, ఆర్‌డీఓ సురేందర్, ఏఈఓలు అనిల్‌కుమార్, అధికారులు, రైతులు పాల్గొన్నారు. మండల కేంద్రంలో బస్టాండు కూడలిలో బాణ సంచా కాల్చారు. అనంతరం సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, సాకలి వెంకటేష్, మాజీ కోఆప్షన్ మైమూద్, జాకీర్, శేఖర్, ప్రతాప్, జయరాజు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

● కోయిలకొండ : ప్రభుత్వం రైతులకు రుణ మాఫీ చేసినందుకు సీయం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి చిత్రపటానికి గురువారం కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విద్యాసాగర్‌గౌడ్, నాయకులు సత్యపాల్‌రెడ్డి, రాజారఘుపతిరెడ్డి, రాజునాయక్, కొండారెడ్డి, నర్సింహ్మారెడ్డి, జగన్‌గౌడ్, రవినాయక్, శేఖర్, రామస్వామి, సురేందర్‌రెడ్డి, యాదయ్య, వెంకటేష్, మనోజ్, ఖాజనవాజ్, గౌస్, రాజుగౌడ్, విక్రమ్‌గౌడ్, మధుసూదన్‌రెడ్డి, ఆశన్నగౌడ్, సత్యం పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్న కాంగ్రెస్

● మహమ్మదాబాద్ : కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కేఎం నారాయణ అన్నారు. మండల కేంద్రంలోని బస్‌స్టాండ్ చౌరస్తాలో బాణసంచా కాల్చి సంబురాలు చేసుకున్నారు. భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ డీసీసీబీ అధ్యక్షుడు కమతం శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు డీసీసీ ఉపాధ్యక్షుడు కమతం విష్ణువర్ధన్‌రెడ్డి, కమతం రాజేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శాంతిరంగ్యా, మాజీ వైస్‌ఎంపీపీ రాధారెడ్డి, మాజీ సర్పంచ్ రామ్‌లాల్, బీసీసెల్ అధ్యక్షుడు బాలముకుందం, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు. అంతకుముందు సీఎం రేవంత్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.



దేవరకద్ర : కౌకుంట్లలో సీఎం, ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

పదేళ్లలో విద్య, వైద్యం మరుగున పడింది

- మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 18 : పదేళ్లలో పాలకులు విద్య, వైద్యరంగాన్ని పూర్తిగా పట్టించుకున్న పాపాన పోలేదని, దీంతో అవి మరుగున పడ్డాయని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఒకేషనల్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన అప్రెంటీస్ మేళా-2024ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపికైన అభ్యర్థులకు ఆయన ఎంపిక పత్రాలను అందజేశారు. ఉపాధి మార్గానికి ఊతం అప్రెంటీస్ మేళాలు అని అన్నారు. కార్యక్రమంలో డీఐఈవో శ్రీధర్ సుమన్, వనపర్తి డీఐఈవో సుదర్శన్, గద్వాల జోగులాంబ జిల్లా నోడల్ అధికారి రమేష్, ప్రిన్సిపాల్స్ గోపాల్, భగవంతచారి, అధ్యాపకులు నందూరి శ్రీనివాస్, వివిధ సంస్థల ప్రతినిధులు, నిరుద్యోగ అభ్యర్థులు పాల్గొన్నారు.

అవగాహన రాహిత్యంతో మాట్లాడటం సరికాదు

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్ నగర్ (క్లాక్ టవర్), జూలై 18 : కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి అవగాహన రాహిత్యంతో బీజేపీ ఎంపీ డీకే అరుణపై మాట్లాడుతూ విమర్శలు చేయడం సరికాదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి. శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రజలు ఎప్పుడూ ఎవరికీ బానిసలు కారన్నారు. పాలమూరు పార్లమెంట్ పరిధిలో ఏడుగురు శాసనసభ్యులు ఉండి, అందులో ముఖ్యమంత్రి నియోజకవర్గంలో ఉండికూడా బీజేపీ ఎంపీగా డీకే అరుణను ప్రజలు గెలిపించారని చెప్పామని గుర్తు చేశారు. ఇటీవల జిల్లా కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వహించిన సమీక్షలో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల పనుల గురించి చర్చించకపోవడం మీ అవగాహన రాహిత్యమని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డిని ఉద్దేశించి అన్నారు. అదే సమావేశంలో పాల్గొన్న ఎంపీ డీకే అరుణ పాలమూరు-రంగారెడ్డి ఎత్తి పోతల పథకం పనులపై, జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టుల పట్ల ఆమెకున్న అవగాహనతో చర్చించి మినిట్స్‌లో చేర్పించిన విషయాన్ని శ్రీనివాస్‌రెడ్డి గుర్తు చేశారు. గురువారం బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు రుణమాఫీ చేయడానికి ఆరు నెలలు పట్టిందని, రైతు భరోస పథకం కింద (రైతుబంధు) నిధులు ఎప్పుడిస్తారన్నది ఎమ్మెల్యే మధుసూధన్ రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికలముందు ఇచ్చిన హామీలను నెరవేర్చి ప్రజల మన్ననలు పొందాలని సూచిస్తూ, అలా కాని పక్షంలో బీఆర్ఎస్ పార్టీకి పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందని, ఇది ఎంతో దూరంలో లేదని ఆయన అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నాగేశ్వర్ రెడ్డి, సీనియర్ నాయకులు శేరి పాండురంగా రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. రమేశ్ కుమార్, కే. కిరణ్ కుమార్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ అచ్చుగట్ల అంజయ్య, కార్యాలయ ప్రముకులు జాజం సుబ్రమణ్యం, మీడియా సెల్ కన్వీనర్ కోస్గి సతీష్ కుమార్, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలి

- సీఐటీయూ జిల్లా నాయకుల డిమాండ్

పాలమూరు, జూలై 18 : ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ.18వేలు అమలు చేయాలని తెలంగాణ కమ్యూనిటీ హెల్త్‌వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. స్థానిక ఎమ్మెల్యే డీయంఆండ్‌హెచ్‌ఓకు, కలెక్టర్ ఏఓలకు వినతిపత్రాలు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. 2023లో చేపట్టిన సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీలు అమలు పరచాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, వరద గాలెన్న, సాధన, యాదమ్మ, పద్మ, ఆశాలు పాల్గొన్నారు.

ఆశ వర్కర్‌ల వినతి

జడ్చర్ల : ఆశ వర్కర్‌ల సమస్యలను పరిష్కరించాలంటూ జడ్చర్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పీఏకు, జడ్చర్ల అర్బన్ హెల్త్‌సెంటర్ అధికారి డాక్టర్ మనుప్రియకు సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రాలు అందచేశారు. వేతనాలు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దీప్లా నాయక్, జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య, ఆశ వర్కర్‌లు సరోజ, నజీమా, షబానా, సుగుణ, జయలక్ష్మీ, శారద, మంజుల, విజయ, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వినాయక చవితి ఉత్సవాలు తొమ్మిది రోజులు నిర్వహించాలి

జడ్చర్ల, జూలై 18 : జడ్చర్ల మునిసిపాలిటీలో వినాయక చవితి పండుగ ఉత్సవాలను తొమ్మి రోజుల పాటు నిర్వహించాలని నిర్ణయించినట్లు విశ్వహిందూ పరిషత్ జడ్చర్ల శాఖ సభ్యులు తెలిపారు. గురువారం వీహెచ్‌పీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ పట్టణంలో వినాయక మండపాలను తొమ్మిది రోజుల పాటు ఏర్పాటు చేసి, భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని కోరారు. ఈ సందర్భంగా మండప నిర్వాహకులు సహకరించాలని మండల అధ్యక్షులు కృష్ణమూర్తి, పట్టణ అధ్యక్షుడు కౌకుంట్లశ్యామ్, నాయకులు జగ్‌పాల్‌రెడ్డి, నరేందర్‌గౌడ్, అఖిల్ కోరారు.

20న అండర్-19 క్రికెట్ జట్టు ఎంపిక

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూలై 18 : తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఈ నెల 20 స్థానిక బాలుర కళాశాల మైదానంలో అండర్-19, సీనియర్ విభాగాల జట్ల ఎంపికలను నిర్వహిస్తున్నట్లు టీసీఏ జిల్లా జిల్లా సెక్రటరీ ప్రేమ్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఏజీపీ కురుమయ్యకు సన్మానం

పాలమూరు, జూలై 18 : అసిస్టెంట్ గవర్నమెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏజీపీ)గా బి.కురుమయ్యను ప్రభుత్వం నియమించటంతో గురువారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన వారికి ఇలాంటి పదవులు ఇచ్చి గౌరవించటం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎర్రం నరసింహ, కె.సతీష్, జి.టి కృష్ణ, బాలగోపి, బండి మల్లేష్, చెన్నవెల్లి శేఖర్, రవికుమార్, విజయ్‌కుమార్, నాగరాజు పాల్గొన్నారు.

నేడు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సదస్సు

పాలమూరు, జూలై 18 : ఎమ్మార్పీఎస్ రాష్ట్ర స్థాయి సదస్సు నేడు యాదగిరిగుట్ట కేంద్రంలోని లక్ష్మీగార్డెన్‌లో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం దక్షిణ తెలంగాణ అధ్యక్షుడు మల్లెపోగు శ్రీనివాస్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సదస్సుకు అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు.